ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 15    సంచిక : 07    మార్చి 2010

**రమణ భాస్కర**
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 20
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి
(హైమ)

**చందా**
సంవత్సర చందా:రూ॥150/-
విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా
**రమణ భాస్కర**
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

**ఈ సంచికలో....**

పాలమూరు.. 25-01-2010
వాలమర్రు ..... 30-01-2010
చించినాడ .... 12-02-2010

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-01-2010, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ లోకంలో అనేక విద్యలు ఉన్నాయి. అన్ని విద్యలలో ఆత్మవిద్యను నేను అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఆయన నియమించేవాడు, మనం నియమింపబడేవారము. అందుచేత ఆయన దేవుడు అయ్యాడు, మనం జీవులం అయ్యాము. మనం దేవుడిని తెలుసుకుంటే దేవుడు అయిపోము, దేవుడి స్వరూపాన్ని పొందుతాము. ఆయన స్వరూపాన్ని పొందిన వాడికి ఇంక పునర్జన్మలు లేవు. అంతర్యామి అంటే నాకు ఏమీ తెలియటంలేదు అని ఒకరు రమణమహర్షిగారిని అడిగారు. దేవుడు అంతటా వ్యాపించి ఉంటాడు అనేమాట నువ్వు ఎప్పుడైనా విన్నావా అని భగవాన్ అడిగారు. అంతటా వ్యాపించి ఉన్నాడు అనే మాట విన్నాను అన్నాడు. అంతటా ఉన్నవాడు నీలో అంతర్యామిగా ఉన్నాడు. వీడు వేరు, వాడువేరు కాదు. వీడూ, వాడూ ఒక్కడే నువ్వు కంగారుపడకు అన్నారు. భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు అనుకుంటున్నావు. అంతటా వ్యాపించి ఉన్న భగవంతుడే అంతర్యామిగా కూడా ఉన్నాడు. పేర్లు తేడా అంతే. వాడు మనకి సర్వసాక్షి మనకి వచ్చే ఆలోచనలకి, మనకు వచ్చే తలంపులకి, మనం మాట్లాడే మాటలకి ఆయన సాక్షిగా ఉంటాడు. ఆయన కర్మ ఫలాన్ని ఇస్తాడు. ఆయనకి కర్మ ఫలదాత అని పేరు. ఆయన జీవకోటికి, పంచభూతాలకి యజమాని. మీరు ఒక మంచి పని చేసారు అనుకోండి, చేసి ఫలితంకోసం ఎదురుచూడకూడదు. అలా ఎదురు చూస్తే మనస్సు పాడైపోతుంది. అది ఎప్పుడు ఇవ్వాలి, ఎక్కడ ఇవ్వాలి, ఎలా ఇవ్వాలి ఆ జీవుడికి ఎలా అనుసంధానం చెయ్యాలి ఆ ఎడ్మినిస్ట్రేషన్ అంతా ఆయన చేతిలో ఉంటుంది. మన చేతిలో ఏమీ లేదు. అంతా ఈశ్వరసంకల్పమే. మనం అనుకున్నది జరిగినా, జరగకపోయినా ఆయన సంకల్పమే జరుగుతుంది.

మీరు వ్యక్తిభావన పెట్టుకొని, దేహభావన పెట్టుకొని చేసిన కర్మలనిబట్టి మరణానంతర జీవితం ఉంది. నరకానికి వెడితేకొన్ని బాధలు ఉంటాయి, స్వర్గానికి వెడితే కొన్ని భోగాలు ఉ ంటాయి అన్నీ అనుభవించిన తరువాత మళ్ళీ ఈ భూమి మీదకు రావలసిందే. అవి సాధనకు పనికి వచ్చే లోకాలు కాదు. ఈ భూమి మటుకు సాధనకి పనికివచ్చే లోకం. అందుచేత మీరు టైముపాడు చేసుకోవద్దు. సబ్జక్టు శ్రద్ధగా మీరు శ్రవణం చెయ్యాలి. మన బంధానికి కారణం మన మనస్సే, మన మోక్షానికి కారణం మన మనస్సే. మన మనస్సుని నియమించుకోవాలి. మనం ఏదిగా ఉన్నామో అది మన హృదయంలోనే ఉంది. అక్కడకు మనం చేరుకోవాలి. మేము దాని గురించి వింటున్నాము, దాని గురించి చదువుతున్నాము కానీ మాకు దుఃఖం పోవటం లేదు అంటారు. చదివినంతమాత్రంచేత, విన్నంతమాత్రంచేత దుఃఖం పోదు. అది అనుభవంలోకి వస్తే దాని తాలుక శాంతి, దాని తాలుకా సుఖము మీకు తెలుస్తుంది. మనం ఏమి చేస్తున్నాము అంటే మనోమూలంలోకి వెళ్ళటం మానేసి మనస్సుని ఆలోకానికి పంపుదాము, మనస్సుని ఈ లోకానికి పంపుదాము అని ఇలా అనుకుంటున్నాము. నీకు ఒక రూపంతోటి, ఒక పేరుతోటి లేకపోతే నీకు ఉన్న మంచితనంతోటి, నీకున్న గౌరవాలతోటి తాదాత్మ్యం ఉన్నంతకాలం హృదయంలో ఉన్న సత్యము నీకు తెలియబడదు. ప్రతీ జ్ఞాని కూడా వాడు ఏ స్థానంలో ఉన్నాడో, ఏ సుఖస్వరూపంలో ఉన్నాడో, ఏశాంతి స్వరూపంలో ఉన్నాడో, మనోదేహములతోటి సంబంధం లేకుండా, లోకంతోటి సంబంధం లేకుండా, దేవతలతోటి సంబంధం లేకుండా ఏ ఆధ్యాత్మిక హృదయంలో స్థిరపడి ఉన్నాడో అక్కడకి భక్తులని తీసుకువెళ్ళటం తప్పించి ఆయనకు ఇంకోపని లేదు. గురువు చేసే పని బయటకు కనబడదు. నీకు ఆత్మే గురువుగా కనిపిస్తున్నాడు. లోపల ఉన్నది ఆయనే. గురువు ఏమి చేస్తాడు అంటే హృదయం యొక్క లోతుల్లోకి దిగటానికి నీకు ఏ బలహీనతలు అడ్డువస్తున్నాయో, ఏ అలవాట్లు అడ్డువస్తున్నాయో వాటిని చూసుకుంటూ ఒకోటి ఒకోటి క్లియర్ చేసుకుంటూ దానికి మనం తట్టుకునేలాగ శక్తినిచ్చి అన్నీ క్లియర్ చేసి ఆయన ఏ స్థితిలో ఉన్నాడో ఆ స్థితిలోనికి తీసుకువెళ్ళే వాడే గురువు. గురువు బోధస్వరూపుడిగా ఉండాలి కాని భక్తుడికి బరువుగా ఉండకూడదు. ఏది నిజమో అది మీకు తెలియకపోయినా ఆయనకు తెలుసు. అక్కడకు గెంటుకొని వెళ్ళేవరకూ గురువు విశ్రాంతి తీసుకోడు. గురువు పని చేస్తూనే ఉంటాడు. ఒకవేళ మనం గురువుని విడిచిపెట్టినా గురువు మనల్ని విడిచిపెట్టడు.

ఓ అరుణాచలేశ్వరుడా నేను నిన్ను తినటానికి వచ్చాను, నువ్వు ఏమి చేసావంటే నేను నిన్ను తినటం ప్రారంభించకముందే నువ్వు నన్ను తినేసి శాశ్వత సుఖములో, ముగింపులేని శాంతిలో, ముగింపులేని ఆనందములో పడేసావు. ఏ వస్తువుకి అయితే చావులేదో దానితోటి నాకు తాదాత్మ్యం కలగజేసావు. అదే నేను అనే అనుభవం కలగజేసాక నాకు మరణభయం

కంప్లీటుగా పోయింది. మనకి వేరుభావన ఉంది. వేరుభావన ఉన్నప్పుడు కోపం వస్తుంది, ద్వేషం వస్తుంది. అన్ని వికారాలు వస్తాయి. మన ఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకుంటున్నాము అనుకోండి అది నిజంకాదు. కేవలం మనోదేహములకి సంబంధించినది. స్వార్థపూరితమైనది అది స్వచ్ఛమైన ప్రేమకాదు. జ్ఞానిప్రేమ అటువంటిది కాదు. అది హద్దులు లేనిది, పరిమితులు లేనిది. తల్లి తన బిడ్డని ఎలా ప్రేమిస్తుందో అలాగే టీచరు కూడా స్కూలులో పిల్లలకు ప్రేమగా చెప్పాలి, ఆత్మవిద్య గురించి మీకు చెప్పేటప్పుడు మేముకూడా అలా చెప్పాలి. అంతేగాని లాంఛనాలకోసం చెప్పకూడదు. మేము ఆత్మవిద్య గురించి ఇప్పుడు ఇక్కడ చెబుతున్నాము, కనీసం మీలో ఎవరో ఒకరికి ఆత్మసుఖం తెలిస్తే, ఆత్మశాంతి దొరికితే చాలు మా పని పూర్తి అయిపోయినట్లే. గురువుకి గుర్తింపులు అక్కరలేదు. మనకి ఏ పనిచేసినా గుర్తింపులు కావాలి. గుర్తింపుల వలన వ్యక్తిభావన పెరిగిపోతుంది. మీరు ఎంత శ్రవణం చేసినా, ఎంత మననం చేసినా, మీరు ఎన్ని మంచిపనులు చేసినా హృదయంలో ఉన్న సద్వస్తువు అనుభవంలోనికి వచ్చేవరకూ మీకు సుఖం తెలియదు.

ప్రతీమనిషి కోరుకునేది ఏమిటి అంటే నాకు అసలు దుఃఖస్పర్శ ఉండకూడదు, ఎప్పుడూ సుఖంగా ఉండాలి, శాంతిగా ఉండాలి అని కోరుకుంటాడు. మీకు సర్వస్వం ఉన్నాయి కాని ఎప్పుడూ అశాంతిగా, దుఃఖంగా ఉంటున్నారు అనుకోండి. మీకు శాంతి లేనప్పుడు, సుఖం లేనప్పుడు అవన్నీ మీరు ఏమి చేసుకొంటారు. మన స్వరూపంలో ఉన్నది సుఖమే, ఆ సుఖాన్ని కనుక మనం పొందితే ఇంక చిల్లర సుఖాలమీదకి, చిల్లర సంతోషాల మీదకి మన మనస్సు వెళ్ళదు. మనం హృదయంలోనికి వెళ్ళటానికి ప్రయత్నం చేస్తాము. మనకి చాలా అలవాట్లు ఉంటాయి, ఏదో అలవాటు బయటకు గెంటుకొని వచ్చేస్తుంది. మనం ద్వేషాలు, కక్షలు, కార్పణ్యాలు పెట్టుకుంటే మనం లోపలికి వెళ్ళటానికి తూకం సరిపోదు. మనం ప్రయత్నం చేస్తూ ఉంటే, గురువుపట్ల భక్తి కలిగిఉంటే, గురుస్మరణ చేస్తూ ఉంటే, గురువుపట్ల సజీవమైన విశ్వాసం కలిగిఉంటే ఆ గురువు ఎప్పుడో సడన్‌గా లోపలికి గుంజేసి హృదయస్థానం మనకి ఇచ్చేస్తాడు. అది గురువు చేసేపని. అది ఫైనల్. గురువు దయలేకుండా గురువుని పొందలేము. మన మనస్సు అంతర్ముఖం అయినప్పుడు నేను మిమ్మల్ని ఎలా చూస్తున్నానో, మీరు ఎంత స్పష్టంగా నన్ను చూస్తున్నారో అంత డైరెక్టుగా ఆయన దయ మనకు తెలుస్తూ ఉంటుంది. గురువుదగ్గర అనుగ్రహం ఉంది అని చెప్పటంకంటే గురువు యొక్క స్వరూపమే అనుగ్రహం. గురువు యొక్క స్వరూపమే శాంతి. గురువు యొక్క స్వరూపమే దయ. శాంతిసామ్రాజ్యంలోనికి మిమ్మల్ని గెంటుకు వెళ్ళటానికి గురువు యొక్క ఒక్క చూపు చాలు, ఒక్క మాట చాలు, ఒక్క స్పర్శచాలు. గురువు ఏ సుఖాన్ని పొందుతున్నాడో ఆ సుఖంలోనికి మిమ్మల్ని మేల్కొల్పలేకపోతే ఈ ఉపన్యాసాలు అనవసరం. ఈ గౌరవాలు, అగౌరవాలు, ఈ

పేర్లు, ప్రతిష్టలు ఇవన్నీ పెంటతో సమానం. ఈ చిల్లర గొడవలమీదకి మన మనస్సును వెళ్ళనివ్వకూడదు. మన డ్యూటీ మనం చెయ్యాలి. మనస్సులో సన్యాసిగా ఉండాలి, మనం ఏమి చేస్తాము అంటే శరీరానికి ఎర్రబట్టలు, మనస్సులో సంసారం. మనం అలా ఉండకూడదు. శరీరం సంసారంలో ఉన్నా మనస్సులో కనుక సన్యాసిగా ఉంటే మనల్ని ఏదీ అంటదు.

మనలను మనం తెలుసుకోవటానికి ఇప్పడు ప్రయత్నం చేస్తున్నాము అనుకోండి, ఒకవేళ మనల్ని మనం తెలుసుకోలేము అనుకోండి, మనం తెలుసుకోలేకపోయినా ఈ జన్మలో ఎంతోకొంత బుద్ధిసూక్ష్మత పెరుగుతుంది, వివేకం పెరుగుతుంది. చేసిన కృషి ఊరికేపోదు అన్నారు భగవాన్. యజ్ఞం అంటే మనల్ని మనం అర్పించుకుని ఏ పని చేసినా అది యజ్ఞమే. యజ్ఞభావనతోటి పనిచేస్తే మనస్సు పరిశుద్ధమవుతుంది. మీరు పేరు ప్రఖ్యాతులు ఆశించకుండా, గౌరవాలు ఆశించకుండా ఒక మంచిపని చేసారు అనుకోండి. మీరు చేసిన మంచిపని ఇక్కడ ఎవ్వరూ గుర్తించలేదు అనుకోండి అయినా మీ మనస్సు పవిత్రమవుతుంది, మీ మనస్సుకి ఏకాగ్రత కలుగుతుంది, మీ మనస్సుకి నిర్మలత్వం కలుగుతుంది. సత్యాన్వేషణకి మీ మనస్సు తయారవుతుంది. మీరు వ్యక్తిభావన లేకుండా పని చేస్తూ ఉంటే ఇది భగవంతుడి పని అని మీరు చేస్తూ ఉంటే మనస్సు లోపల నెమ్మదిగా అణిగిపోవటం ప్రారంభమవుతుంది. ఈ పని నేను చేస్తున్నాను అని అనుకుంటే మనస్సు విజృంభిస్తుంది. భగవంతుడు మీకు ఏ పని అయితే కేటాయించాడో ఆ పని ఆయనే చేసిపెట్టి ఉంచుతాడు. అది మీరు నిమిత్తమాత్రంగా చేసి పని అయిపోయింది అనుకుంటారు. కానీ భగవంతుడి సంకల్పం వల్లే మనకి ఈ పని అయ్యింది అనే బుద్ధి మనకి రాదు. మన తెలివితేటలవల్ల ఆ పని చేసాం అనుకొంటాము. అప్పడు అహంకారం ప్రారంభమవుతుంది. దేహాభిమానం పెరిగిపోతుంది. ఈ లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయికాని ఏ ఆకర్షణకి గురికాకుండా భగవంతుడిని దృష్టిలో పెట్టుకొని, భగవంతుడి యొక్క వాక్యాన్ని ప్రమాణంగా తీసుకొని, భగవంతుడి మాటని దైవంగా తీసుకొని ఆ మాటని మనం ఆచరించటం ప్రారంభిస్తే అప్పడు అనుభవం కలుగుతుంది. నువ్వు చేతులతోటి పనిచేస్తున్నా మనస్సు మాత్రం భగవంతుడి పాదాలయందు ఉండాలి. అది నేర్చుకోండి. ఎందుచేతనంటే బాగుపడవలసింది మనస్సు.

ఆత్మవిద్య లేకుండా ఆత్మ తెలియబడదు. అది మీకు రాకుండా అడ్డుపడేవారు బయట ఎవరూ లేరు. మీ కామక్రోధములే అడ్డుపడుతున్నాయి. కామం అంటే కోరిక, కోరికల్ని నెరవేర్చుకుంటూ కోరికల్ని జయించవచ్చు కదా అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నువ్వు చెప్పేది ఎలా ఉంది అంటే మంటపైన పెట్రోలు పోస్తూ ఆ మంట ఆర్పటం ఎటువంటిదో వచ్చిన కోరికలన్నీ నెరవేర్చుకుంటూ కోరికల్ని జయించటం అటువంటిది అన్నారు. కోరికకి సంతృప్తి ఏముంది. మొత్తం భారతదేశం అంతా మీకు ఒక్కరికే రాసి ఇచ్చినా మీకు సంతృప్తి ఉండదు,

సరిపోతుందని అనిపించదు, పక్క దేశం కూడా కావాలని అనిపిస్తుంది. మనస్సు యొక్క మోహం అటువంటిది. మనోనాశనం అయ్యేవరకు నీకు ఆత్మజ్ఞానం కలగదు. ఆత్మజ్ఞానం కలగకపోతే ఆత్మసుఖం తెలియదు. బ్రహ్మవిద్య సంపాదించటానికి నువ్వు ఎంత ప్రయత్నం చేసినా ఈ కామక్రోధాలు నీకు అడ్డువచ్చేస్తాయి. మీరు ఎవరికైనా అపకారం చేసారనుకోండి, నేను అపకారం చేసాను అని అస్తమానూ అనుకోనక్కరలేదు. అది మరచిపోవటమే. ఆ అపకారం అనేది మళ్ళీ చేయకుండా ఉండాలి. అదీ సాధనలో భాగమే. కొంతమంది జరిగిపోయిన గొడవలు అస్తమానూ తలచుకుంటూ ఉంటారు. దానివలన మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది. నీ సాధన సరిగ్గా సాగదు. మనకి అవసరం లేని గొడవలు అన్నీ తలపెట్టుకున్నాము అనుకోండి శరీరంలో ఉన్న శక్తి, మనస్సులో ఉన్న శక్తి తగ్గిపోతుంది. మన మనోదేహములు అసలు సాధనకి పనికిరాకుండా పోతాయి. మన దేహయాత్రకు సరిపడి ఈ మనోదేహాలని ఉపయోగించుకోవాలి. మిగతాటైము అంతా లోపల సత్యాన్వేషణకు వాటిని ఉపయోగించాలి. నువ్వు వందేళ్ళు బతికావు. సత్యాన్వేషణ లేదు. నువ్వు ఏమి సాధించినట్టు. జీవించి ఉండగానే మోక్షస్థితి పొందటానికి నీ మనస్సును, నీ దేహాన్ని మేగ్జిమమ్ ఉపయోగించు. అది జీవితగమ్యం. మనిషి జీవన్ముక్తుడు అవ్వాలి. ఒక మనిషి జీవన్ముక్తుడు అయితే లక్షలాది మంది ప్రజలకి అతని ద్వారా మేలు కలుగుతుంది. అతను ప్రసంగాలు చేయనక్కరలేదు, రాతలు రాయనక్కరలేదు. అతని అస్థిత్వం సరిపోతుంది. జీవన్ముక్తస్థితిని పొందిన వాడి ద్వారా శాంతి తరంగాలు, కాంతి తరంగాలు, ముక్తి తరంగాలు వ్యాపించి ఆ స్థితిని మనం కూడా పొందాలనే ప్రేరణ మీకు కలుగుతుంది. సత్‌పురుషలతోటి, సాధువులతోటి, సద్బుద్ధి ఉన్నవాళ్ళతోటి మనం సహవాసం చేస్తూ ఉంటే మనం కూడా అలా ఉండాలి, మనం ఆ స్థితిని పొందాలి అనే బుద్ధి మనకు కలుగుతుంది. అదీ సహవాసం యొక్క మేలు. డబ్బుపోతే సంపాదించుకోగలము కాని కాలంపోతే మళ్ళీ మనం సంపాదించుకోలేము. అందుచేత కాలాన్ని మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి.

భగవంతుడు చెప్పిన మాటపట్ల చాలా శ్రద్ధగా ఉండాలి, అశ్రద్ధ పనికిరాదు. శ్రద్ధ లేకుండా ఎవరికి ఆత్మజ్ఞానం కలగదు అని పరమాత్మ చెప్పాడు. కానీ న్యూటన్ ఏమని చెప్పాడంటే ఒక్క శ్రద్ధ సరిపోదు అది సహనంతో కూడి ఉండాలి, ఓర్పుతో కూడిన శ్రద్ధ ఉండాలి అన్నాడు. హృదయంలో ఒక మహత్తరమైన శక్తి ఉంది. దాని స్పర్శ నీకు కలగకుండా కేవలం నీ ప్రయత్నం వలన నీకు బ్రహ్మజ్ఞానం రాదు అన్నాడు. మనం సూర్యుడిని చూస్తే ఎలా కనిపిస్తాడు. సూర్యుడుని మన చేతిలో పెట్టుకొని ఆడుకోవచ్చు అనుకుంటాము. కానీ సూర్యుడు భూమికంటే పెద్దవాడు. అంటే మీకళ్ళకి కనిపించేది నిజంకాదు, హృదయంలో ఉన్న వస్తువు ఎంత పవిత్రమైనదో, ఎంత ఏకాగ్రమైనదో, అది ఎంతలోతైనదో, ప్రపంచాన్ని నడిపే పదార్థం

ఎంత దోషరహితంగా ఉందో నువ్వు కూడా అంత పరిశుద్ధుడవు అయితేనేగాని అది నీకు తెలియబడదు. న్యూటన్ మనం చేస్తున్న ఇంకో పొరపాటు చెప్పాడు. బ్రహ్మపదార్థం గురించి వెదుకుచున్నారు కాని అది మనకు దొరకటంలేదు. అది మనకి దొరకటంలేదు అని అనుకోవటం మానేసి ఆ బ్రహ్మపదార్థమే లేదు అనుకుంటున్నాము. మనం ప్రయత్నం చేసినా ఆ లోతు అందటంలేదు అని తెలుసుకోవటం మానేసి అసలు ఏమీ లేదు అంతా శూన్యం అనుకుంటున్నాము. బ్రహ్మపదార్థము శూన్యములాగ ఉంటుంది కాని శూన్యము కాదు. అక్కడ లోపాలు లేవు, బలహీనతలు లేవు. అది పెర్ఫెక్టు. అది ఏ స్థాయిలో ఉందో ఆ స్థాయిని పొందితే ఆ వస్తువు తాలుక దయ నీకు కలిగితే అది నీకు తెలియబడుతుంది కాని కేవలం నీ ప్రయత్నం వలన నీవు దానిని పొందలేవు. అందరూ మేము బుద్ధిమంతులము, మేము బుద్ధిమంతులము అనుకుంటున్నారు. మీరు బుద్ధిమంతులని లోపల బ్రహ్మము అనుకోవాలి కదా. మీ నెత్తిమీద మీరే అక్షింతలు వేసేసుకోవటం ఏమిటి? “ఎవడైతే పనిచేస్తున్నా పని చెయ్యనివాడితో సమానమో వాడు బుద్ధిమంతుడు” అని భగవంతుడు గీతలో చెప్పాడు. మీరు కాశీలో రేవు కట్టించారనుకోండి, మీరు కాశీలో రేవు కట్టించారు అని నేను అనకముందు మీ మనస్సు ఎలా ఉందో నేను అన్నాక కూడా మీ మనస్సు అలాగే ఉంటే మీరు బుద్ధిమంతులు. కానీ నేను అన్నాకా మీకు ఎంతోకొంత సంతోషం వస్తే మీకు వ్యక్తీభావన ఉన్నట్లు కదా మీరు ఔట్ అని పరమాత్మ చెప్పాడు.

మనకి జ్ఞానం రాకుండా మనకున్న అలవాట్లే మనకి అడ్డు వస్తున్నాయి. కొంతమందికి అలవాట్లు లోపల చాలా లోతుగా ఉంటాయి. అవి ఎంత లోతుగా ఉంటే నువ్వు అంతకష్టపడి సాధన చేస్తేకాని ఆ అలవాటు బయటకు రాదు. అప్పడు నీకు గురువు సహాయం ఉండాలి. గురువు యొక్క దయ నోటితో చెప్పలేము, ఆ దయ మాటలకి అందదు. గురువు దయ లేకుండా ఆయనని పొందలేము. గురువు చేసే పని ఏమిటి అంటే ఏది తెలుసుకుంటే మీకు స్వేచ్ఛ కలుగుతుందో, ఏది తెలుసుకుంటే మీరు సుఖి అవుతారో దానిని తెలుసుకోవటానికి మీకు ఇష్టంలేకపోయినా, దానిని తెలుసుకోవాలనే బుద్ధిని కలగజేసేవాడు గురువే. తెలియచెప్పేవాడు గురువే, తెలియబడేది గురువే. మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు. వాడితోటి డైరెక్టుగా మీకు అనుబంధం లేకపోతే ఆ వస్తువుతోటి అనుబంధం ఉన్నవాడితోటి సహవాసం చెయ్యండి. సహవాసం చెయ్యటంవలన ఆ వస్తువు పొందాలి అనే బుద్ధి మీకు కలుగుతుంది. సజ్జనసాంగత్యం ఎటువంటిది అంటే బట్టలు మనలని కొనుక్కోమని చెప్పరు. వాడే కొంటాడు, వాడే కుట్టిస్తాడు. సజ్జనసాంగత్యం అంటే అంతా వాడే చేస్తాడు. సహజంగా వచ్చేగాలి ఎటువంటిదో సజ్జనసాంగత్యం అటువంటిది. సత్పురుషులతోటి సహవాసం చెయ్యగా, చెయ్యగా మీకు ఎంతోకొంత వైరాగ్యం వస్తుంది. వైరాగ్యం, వివేకం ఇవి రెండూ మనకి రెండు

కళ్ళులాంటివి. ఏ మాట వినాలి, ఏమాట వినకూడదు దానికి వివేకం ఉండాలి. కనిపించినదల్లా నాకు కావాలి అంటే వాడికి వైరాగ్యం లేదని అర్థం. పైకి మనం అందరిలాగే ఉండాలి మనం లోపల ఎంతోకొంత వైరాగ్యాన్ని పోషించుకోవాలి. మనం ప్రతీ చిన్న విషయానికి ఉద్రేకపడతాము అనుకోండి ఆలోచనాశక్తి తగ్గిపోతుంది. మన తలంపు, మన ఆలోచన, మన శక్తిని అంతా హృదయం మీద పెడితే, మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే హృదయంలో ఉన్న సద్వస్తువు ఏదో టైములో మనకి అనుభవంలోనికి వస్తుంది. అనుకరణ పనికిరాదు. భగవంతుడు ఒకో మనిషికి ఒకో పని కేటాయిస్తాడు. నీ శరీరానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పని ఇష్టంగా, ప్రేమగా చెయ్యి. ఆపని పట్ల నీ మనస్సునీ, దేహాన్నీ అర్పించి చెయ్యి. భగవంతుడికి అర్పించి చెయ్యి. ఆ రకంగా నువ్వు పనిచేస్తే ఆ పని చేస్తూ పనిలేనిస్థితికి ఎదిగివెళ్ళిపోతావు. పని మిమ్మల్ని ముట్టుకోదు. పని మిమ్మల్ని వదిలేస్తుంది. మీ ఇంట్లో మీ డ్యూటీ మీరు చేస్తూ మనం పొందవలసింది వేరే ఉంది అని మనస్సుని భగవంతుడి మీద పెట్టుకోండి. అప్పుడు నీ ధర్మాన్ని నువ్వు బాగా నిర్వర్తిస్తున్నావని అర్థం. ఆ రకంగా చేసినా నీకు హృదయంలో ఉన్న శక్తిపాతం మేల్కొంటుంది. దానికి ఒక్కసారి మెలకువవచ్చిందా మీ పని పూర్తి అయిపోయినట్టే. మీకు బ్రహ్మజ్ఞానం వచ్చేస్తుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-01-2010, వాలమర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సీతమ్మగారి జ్ఞాపకార్థం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసాము. ఆవిడ పరిపూర్ణమైన విశ్వాసం, పరిపూర్ణమైన భక్తి గల వ్యక్తి. కపటంలేని జీవితం ఆవిడది. కొంతమందిలోపల ఒక రకంగా ఉంటారు, బయటకు ఒక రకంగా ఉంటారు. ఇలా లోపల బయట బేధం లేకుండా సీతమ్మగారు ఒకేరకంగా జీవించారు. మీరు సబ్జక్టు బాగా అర్థం చేసుకోవాలి. అసలు మనిషికి దుఃఖం ఎందుకు వస్తోంది, అశాంతి ఎందుకు వస్తోంది, జన్మలు ఎందుకు వస్తున్నాయి. దానికి కర్తృత్వం కారణం అని చెపుతారు. మేము సాధన బాగా చేస్తున్నాము అని చెపుతారు గాని ఒక్కడికీ దేహాభిమానం పోలేదు. మనకు దేహం మీద ఇష్టం పోలేదు. దేహం మీద మనకు ఉన్న ఇష్టం కొలదీ, అభిమానం కొలదీ మన దేహానికి మరణం వస్తే కంగారుపడిపోతాము. అదే ఇతరుల దేహానికి మరణం వస్తే నేను కంగారుపడను ఎందుచేత నంటే ఆ దేహం నాది కాదని నాకు తెలుస్తోంది. ఆ దేహం కూడా నాదే అనుకునే వాడు ప్రజా సేవకుడు అవుతాడు, మహాత్ముడు అవుతాడు. సర్వసాధారణంగా మనం ఇతరులకు సేవ చేసినా వ్యక్తిభావనతో చేస్తాము. దాని వలన పుణ్యం వస్తుంది కాని అజ్ఞానం పోదు. మనం ఇతరులకు ఏదైనా సహాయం చేస్తే వారికి ఉపకారం చేసాము అనుకొంటాము. ఆ దేహం

కూడా మన దేహం అనుకొంటే ఉపకారం చేసాము అనే బుద్ధి ఇంక మనకు రాదు. మనలో అజ్ఞానం ఉన్నంతసేపు దుఃఖం వస్తుంది, అశాంతి వస్తుంది, జన్మలు వస్తూనే ఉంటాయి. కొంతమంది అహంభావన బయటకు తెలుస్తూ ఉంటుంది, కొంతమంది మనకు తెలియనివ్వరు. మనం ఎవరితో అయినా మాట్లాడేటప్పుడు ఆ మనిషిలో ఎంతోకొంత అహంభావన ఉంది అనుకొనే మాట్లాడాలి. వాడికి అహంభావన ఉంది కాబట్టే ఈ జన్మ వచ్చింది, అహంభావన లేకపోతే అసలు జన్మేరాదు. అది దృష్టిలో పెట్టుకొని మాట్లాడితే మనం సమానంగా మాట్లాడగలము. వారికి అహంభావన లేదనుకొని మాట్లాడితే ప్రమాదంలో పడతాము.

వ్యక్తిభావన లేకుండా మనం సేవచేస్తే, పూజచేస్తే అహంభావన నెమ్మదిగా తగ్గిపోతుంది. లోపల వ్యక్తిభావన పెట్టుకొని సేవచేయటం వలన మీకు పుణ్యం వస్తుంది కాని అహంభావన నశించదు. సేవ చేసేటప్పుడు మనం పైకి అనకపోయినా వారికి సేవ చేసాము, వీరికి సేవ చేసాము అని లోపల అనుకొంటాము కదా. అలా లోపల అనుకొన్నా ప్రమాదమే. లోపలే కదా అని అనుకోవద్దు. అది మీరు పరిశీలనగా చూసుకోండి. మనకి ఏవో కోరికలు వస్తున్నాయి. అవి ఎక్కడనుండి వస్తున్నాయి. అవి బయట నుండి రావటంలేదు. లోపలనుండే వస్తున్నాయి. ఇప్పడు ఈ శరీరంతో ఎలా ఉన్నామో అలాగే మనం పూర్వ నుండి కొన్నివేల శరీరాలు మార్చుకొంటూ వస్తున్నాము. పూర్వజన్మల నుండి మనకు కొన్ని అలవాట్లు ఉంటాయి. అవి వాసనకింద మారి మేకులు దిగినట్లు అలా మనస్సులో ఉంటాయి. ఈ శరీరం చనిపోతుంది. మరణానంతరం మనస్సు మన కూడా వచ్చేస్తుంది. కోరికలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఈ కోరికలు నెరవేరాలంటే దానికి శరీరం కావాలి కాబట్టి కొత్తశరీరం వస్తుంది. మీకు సినిమా చూడాలి అనే కోరిక ఉంది అనుకోండి, అది మనస్సులో ఉంది కాని వెళ్ళి చూడటానికి శరీరం ఉండాలి, కళ్ళు ఉండాలి. నీ లోపల ఏ వాసన లేకపోతే అసలు నీకు కోరిక రాదు. మనకు ఏ కోరికలు వస్తున్నాయో తెలుస్తోంది కదా. ఆ కోరిక తాలుక వాసన లోపల ఉన్నట్లు అర్థం చేసుకొని అందులోనుండి విడుదలపొందటానికి మనం ప్రయత్నం చేయాలి. మీరు ఇంకోటి జ్ఞాపకం పెట్టుకోండి. ఏదైనా అదృష్టం వచ్చి మీద పడింది అనుకోండి ఇది నిజం కాదు ఇది స్వప్నం అనుకోండి. అలాగే ఏదైనా దురదృష్టం వచ్చినప్పడు కూడా ఇది నిజంకాదు ఇది స్వప్నం అనుకోండి. ఇది అలవాటు చేసుకొంటే అదృష్టం వచ్చినప్పడు పొంగిపోవటం, దురదృష్టం వచ్చినప్పడు కుంగిపోవటం తగ్గిపోతుంది. మీకు లోచూపు కలుగుతుంది. సర్వసాధారణంగా అదృష్టం వచ్చినప్పడు పొంగిపోతారు, దురదృష్టం వచ్చినప్పడు కుంగిపోతారు. దీనివలన వ్యక్తిభావన పెరిగిపోతుంది, జన్మలు పెరిగిపోతాయి, దుఃఖం పెరిగిపోతుంది. మీరు వంద ఏళ్ళు బతికినా ఎంతసేపు లోకం వంక చూడటం తప్ప, బయటకు

చూడటం తప్ప లోపలకు చూసుకోరేమిటి అన్నాడు వేమన. మీరు లోచూపు నేర్చుకోవటంలేదు. చనిపోయేవరకు బయటకే చూస్తున్నారు. ఉన్నదంతా లోపలే ఉంది బయట ఏమీ లేదు. లోపలకి చూసేవాడికి కదా ఆత్మసుఖం తెలిసేది అన్నాడు వేమన.

మన మనస్సు మనం చెప్పినట్లు వింటోంది అనుకోండి, సాత్వికంగా ఉంది అనుకోండి, శాంతిగా ఉంది అనుకోండి, మన బంధువులు స్నేహితులు, మన ఐశ్వర్యం ఎవరూ చేయలేని ఉపకారం మన మనస్సే మనకు చేస్తుంది. ఇది జ్ఞాపకం పెట్టుకోండి. మనల్ని రోజూ దేవుడు ముట్టుకోవటంలేదు, జ్ఞానం ముట్టుకోవటంలేదు, మాయ వచ్చి రోజూ ముట్టేసుకుంటోంది. ఏ గంటలో ఎలాగ ఉంటామో మనకు తెలియదు. చాలా మంది ధనవంతులు సామాన్య మానవులతో కలిసి ఉండరు. కొంతమంది బాగా తెలివైనవారు కూడా సామాన్యమానవులతో కలిసి ఉండరు. అంటే వారిలో ఏదో ప్రత్యేకత ఉంది అనుకొంటారు. ప్రపంచ మేధావులలో ఒకడైన ఐన్‌స్టీన్ మనలాగే మామూలుగా ఉన్నాడు, అందరితో కలిసి తిరిగాడు. ఆయన చాలా తెలివైనవాడు కాని నేను మేధావిని అని ఆయన అనుకోలేదు. అందుచేత కామన్‌మేన్‌తో కలిసి ఉన్నాడు. మీకు డబ్బు ఉంటే ఫరవాలేదు కాని నాకు డబ్బు ఉంది, నేను ధనవంతుడిని అనుకొంటే మీరు పాడైపోతారు, మీ మనస్సు పొల్యూట్ అయిపోతుంది. ఐన్‌స్టీన్ ఏమి చెప్పాడు అంటే నేను గొప్ప విషయాలు కనిపెట్టానని ప్రపంచం అనుకొంటోంది కాని వాటిని కనిపెట్టటానికి ఆ తెలివితేటలను ఎవరు ఇచ్చారు, భగవంతుడే ఇచ్చాడు లేకపోతే నాకు సాధ్యంకాదు అన్నాడు. సమాజం నన్ను ఎంతో గౌరవించింది, ఎంతో సహాయం చేసింది. సమాజం నాకు ఎంత చేసిందో అంత తిరిగి సమాజానికి చేయకుండా చనిపోతున్నాను, అదే బాధగా ఉంది అని చెప్పాడు, వాడు ఐన్‌స్టీన్. సమాజం మనకు ఋణపడి ఉంది అని మనం అనుకొంటాము అంటే మన ఆలోచన ఎలా ఉందో, ఎంత పాడైపోతున్నామో చూడండి. మీరు ఇంటికి వెళ్ళి ప్రశాంతంగా కూర్చొని ఆలోచించుకోండి. మన ఇంద్రియాలు, మన మనస్సు మనలను పాడుచేసినట్లు ఇతరులు ఎవరూ మనలను పాడుచేయలేరు. చెవులు ఏవో సినిమా పాటలు వినమంటాయి, కళ్ళేమో బొమ్మలు చూడమంటాయి, నోరు ఏమో ఎవరినో ఒకరిని తిట్టమంటుంది. అంటే ఒక్క ఇంద్రియం మనకు సహకరించటంలేదు. మన ఇంద్రియాలు, మనస్సు మనకు సహకరిస్తే ఈ జన్మలోనే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది.

నీ సహజస్థితిలో ఉండు అంటే నువ్వు ఎలాగ ఉన్నావో అలాగ ఉండు అని చెప్పటం. మనం అలాగ ఉండలేకపోతున్నాము. మనకు శరీరం వచ్చింది అది మనం కాదు. మనకో మనస్సు ఉంది అది మనం కాదు. మనకు గౌరవం వచ్చింది అనుకోండి అది మనం కాదు. మనకు అగౌరవం వచ్చింది అనుకోండి అది మనం కాదు. మనం కాని గొడవలతో మనం తాదాత్మ్యం పొందటం వలన మనం ఏదిగా ఉన్నామో అదిగా ఉండలేకపోతున్నాము. మీ

శరీరాన్ని మరిచిపోయి, గౌరవాలను మరిచిపోయి, ఏ కోరికలు లేకుండా, ఏమీ ఆశించకుండా హృదయపూర్వకంగా భక్తితో మీరు పనిచేస్తూ ఉంటే ఆత్మసుఖాన్ని పొందుతారు. దానికోసం ప్రయత్నం చేయకుండా బయట ఏదో పొందాలి, ఏదో పొందాలి అని పనిచేస్తూ ఉంటే ఆత్మ సుఖం ఎలా దొరుకుతుంది. సహజస్థితి ఉన్నమాట నిజం, అది లేదు అని అనుకోవద్దు. మీకు కర్తృత్వబుద్ధి ఉన్నంతకాలం జన్మలు తప్పవు, కష్టాలు తప్పవు, మీరు ఏ లోకాలకు వెళ్ళినా దుఃఖం మిమ్మల్ని విడిచిపెట్టదు. మీరు సాధన చేసి అందులోనుండి విడుదలపొందితే కర్తృత్వం కల్పితమే, సహజస్థితి నిజం అని మీకు అనుభవంలోనికి వస్తుంది. ఏదో ఉన్నామండి సంతోషంగా లేము అని కొంతమంది అంటారు. మనిషికి ఎంత ఉన్నా సంతృప్తిలేదు, ఇంక వాడికి సంతోషం ఎలా వస్తుంది. సంతృప్తి లేనివాడికి సంతోషం రాదు. మీకు జ్ఞానం వచ్చేసింది అనుకోండి. జ్ఞానం కలిగితే మీకు వందకోట్లు డబ్బు వచ్చేయదు లేకపోతే మిమ్మల్ని తీసుకొని వెళ్ళి ఏ ప్రధానమంత్రి పదవో ఇవ్వరు. జ్ఞానం రాగానే మనస్సు నష్టపోతుంది, అప్పుడు వాసనలు అన్నీ కాలిపోతాయి, ఈ సృష్టిని దాటి పరమశాంతిలో, ఆనందంలో ఊగిసలాడతాడు, అదీ జ్ఞానం యొక్క వైభవం. వాసనలు మనలో ఎక్కడో లోపల ఉంటాయి. సాధన చేస్తూ ఉంటే ఒకోటి ఒకోటి బయటకు వస్తాయి కాని సాధన చెయ్యకపోతే అవి లోపల ఉన్నట్లు కూడా మనకు తెలియదు. మీ ఇంటి దగ్గర మీరు చేయవలసిన పనులు అన్నీ అయ్యాక మీరు ఒంటరిగా ఖాళీగా కూర్చొన్నప్పుడు ఆ టైము ఎలా గడుపుతున్నారో దానినిబట్టి మీ జీవితాలు నిర్మింపబడతాయి అని ఒక రచయిత చెప్పాడు. మీకు మోక్షం వస్తుందా, రాదా అన్నది ఆ టైము ఉపయోగించుకోవటం మీద ఆధారపడి ఉంది అని చెప్పాడు.

అందరూ ఎవరికొంపల్లో వారు పడి ఉంటున్నారు. శరీరాలు కొంపల్లోనే ఉంటున్నాయి అంటే గృహవాసం. నీ శరీరం ఇంట్లో ఎలా పడిఉంటుందో అలాగ నీ మనస్సు గుహలో ఉండాలి అది గుహవాసం. మీరు గృహవాసం చేస్తున్నారు, గుహవాసం కూడా నేర్చుకోండి. మనస్సు శిరస్సులో ఉన్నప్పుడు అది విజృంభిస్తుంది. మనస్సు శిరస్సులో కాకుండా ఎక్కువగా హృదయగుహలో కనుక ఉంటే వాసనల యొక్క బలం తగ్గిపోయి, అవి నెమ్మదిగా క్షీణిస్తాయి. అంటే పునర్జన్మ కారణాలు కాలి బూడిద అయిపోతాయి అందుచేత గుహవాసం నేర్చుకోవాలి. ఐన్‌స్టీన్ అన్నాడు మీరు అందరూ కాలేజీలకు వెళ్ళిపోతున్నారు, చదువుకోసం ఇతర దేశాలకు కూడా వెళుతున్నారు, మీరు బాగా చదువుకొంటున్నారు కాని ఆలోచించటం మటుకు నేర్చుకోవటంలేదు, ఎప్పుడైనా ఏదైనా ఒక విషయం గురించి మీరు స్వంతంగా ఆలోచించారా మనం స్వంతంగా ఆలోచిస్తే చాలా సమస్యలు పరిష్కారమవుతాయి. ప్రతీ మనిషికి ఆలోచన తక్కువ, ఆవేశం ఎక్కువ. మన ఇంద్రియాలు మన స్వాధీనంలో ఉంటే, మన మనస్సు మన స్వాధీనంలో ఉంటే మన బంధువులతోగాని, స్నేహితులతోగాని, ఐశ్వర్యంతోగాని, అధికారంతోగాని

ఏమీ సంబంధం లేకుండా నూటికి నూరుపాళ్ళు మనం పరమశాంతిని అనుభవించవచ్చు. శరీరం చనిపోయేటప్పుడు కూడా అయ్యో ఈ శరీరం పోతోంది ఏమిటి అని కూడా మీకు అనిపించదు. అటువంటి శాంతిని మనం పొందుతాము. సబ్జక్టును సరిగా అర్థం చేసుకోకుండా ఏవో మంచిపనులు చేస్తున్నాము అంటే దాని వలన పుణ్యం వస్తుంది, కొంతకాలం మీకు రోజులు సుఖంగా వెళ్ళిపోతాయి, తరువాత అది ఖర్చు అయిపోతుంది. సబ్జక్టు మీద శ్రద్ధలేకుండా, అసలు ఏది తొలగించుకోవాలో క్లేరిటీ లేకుండా ఏవో సాధనలు చేస్తున్నాము అంటే ఇలా కోటిజన్మల తరువాత కూడా ఆత్మజ్ఞానం రాదు. అసలు అర్థం చేసుకోవటం కంటే మించిన యోగం లేదు. ఇప్పుడు మనం తలకాయలో ఉంటున్నాము కదా హృదయగుహలోనికి వెళ్ళి రిటైర్ అయిపో అంటున్నారు భగవాన్.

మీరు బాగుపడండి. ఎదుటివారు బాగుపడటానికి మంచి మాటలు చెప్పండి. బాగు పడమని చెప్పండి. వారు బాగుపడరు అనుకోండి, వదిలేయండి, అస్తమాను వారి గురించి ఆలోచించి మీరు తలకాయపోటు తెచ్చుకొంటే మీరు శుభ్రంగా పాడైపోతారు, మూలంలో కుళ్ళిపోతారు, దేనిలోనూ అతిగా ఉండవద్దు. ఇంట్లో అందరూ విరోధులు అనుకోండి, సమాజంలో అందరూ విరోధులు అనుకోండి, మనంతట మనం సుఖంగా ఉంటున్నాము అనుకోండి ఈ సమాజం గొడవ మనకు ఎందుకు? అసలు నువ్వు సుఖంగా ఉండటానికి ఇంట్లోవారితోటి, సమాజంతోటి నీకు పనేమిటి? మనంతట మనం సుఖంగా ఉండలేక వారి జతలు పడితే, వీరి జతలు పడితే సుఖం వచ్చేస్తుందని వెళ్ళి వారితో కలబడిపోవటం, అక్కడ నుండి దుఃఖం కొనితెచ్చుకోవటం, డబ్బు పెట్టి అశాంతిని కొనుక్కోవటం. మీరు ఏదైనా చందాలు ఇస్తే ఇవ్వవచ్చు. మంచిపనులకు చందాలు ఇవ్వటంవలన పుణ్యం రావచ్చు. దాని వలననే మీకు ఆత్మజ్ఞానం రాదు. చందాలు ఇచ్చేటప్పుడు కూడా నేను ఇస్తున్నాను అనే భావనతోటి ఇస్తాము, అహంకారంతోటి ఇస్తాము. బయట చందాలు ఇచ్చినట్లు ఉంటుంది కాని లోపల రోగం పెరిగిపోతుంది, కొంతమంది వారి తెలివితేటలు అన్నీ సమాజానికి ఉపయోగిస్తారు. సమాజం దగ్గర నుండి ఏమీ ఆశించరు. సురేంద్రనాథ్ బెనర్జీ దేశంకోసం చాలా కష్టపడ్డారు, దేశంకోసమే ఆయన టైము అంతా ఉపయోగించాడు. ఫలకాంక్ష లేకుండా దేశానికి సేవ చేసాడు. ఆయన కలకత్తాలో ఒక సభలో మాట్లాడుతూ ఉండగా ఒకడు ఆయన మీద చెప్పు విసిరాడు. అప్పుడు ఆయన ఒకమాట అన్నాడు. నేను అన్నీ వదులుకొని 40 సం॥లు ఈ దేశానికి సేవచేస్తే ఈ ప్రజలు నాకు చెప్పు బహుమతిగా ఇచ్చారు అని బాధపడ్డాడు. ఆయన గొప్పవాడేకాని అహంభావన ఉంటుంది కదా. ఆ చెప్పు చూసేటప్పటికి ఆయన చేసిన సేవ సడన్‌గా గుర్తుకువచ్చి వికలం అయిపోయాడు. అహంకారం అటుకొడితే ఇటు వస్తుంది, ఇటుకొడితే అటువస్తుంది. అది తొందరగా మనిషిని విడిచిపెట్టదు. మనం ప్రయత్నం

చేయవచ్చు కాని గురువు దయలేకుండా, ఈశ్వరుని దయ లేకుండా దానిని బయటకు గెంటలేము. అది పెద్ద బండరాయి లాంటిది. దానిని గెంటటానికి మన ప్రయత్నం ఒక్కటే సరిపోదు. ఈశ్వరుని దయ ఉండాలి. ఆయన దయ ఎప్పుడు వస్తుందో చెప్పలేము. మనం ఈ బొమ్మలను చూసి ఈశ్వరుని పాదాలను విడిచిపెట్టకూడదు. తుకారామ్ జీవితంలో ఎన్నో అవమానాలు పొందాడు. ఇక్కడ మీరు గ్రహించవలసింది ఏమిటి అంటే అవమానాలు రాకముందు ఆయన ఎలా ఉన్నాడో అవమానాలు వచ్చినప్పుడు కూడా అలాగే నిర్మలంగా కూల్‌గా ఉన్నాడు. అలాగే మీ జీవితంలో కూడా ఏవో గొడవలు వస్తూ ఉంటాయి. వాటిని చూసి మీరు కంగారు పడవద్దు. మీరు లోపల శాంతిగా ఉన్నారు అనుకోండి. పరిస్థితులను బట్టి మీకు ఏదైనా దుఃఖం వచ్చినా అది దూరంగా ఉండి మిమ్మల్ని చూసి వెళ్ళిపోతుంది. మీ దగ్గరకు ఎందుకు రాదు అంటే మీరు లోపల శాంతిగా ఉన్నారు అంటే పరమాత్మకు దగ్గరగా ఉన్నారు. లోపల ఉన్న పరమాత్మతో మనం సన్నిహితంగా ఉంటే దుఃఖం దగ్గరకు రాదు, దూరం నుండే చూసి వెళ్ళిపోతుంది. అలాగే లోకానికి సంబంధించిన సంతోషం కూడా వచ్చి మిమ్మల్ని ముట్టుకోదు. మొట్టమొదట దూరం నుంచి చూసి వెళ్ళిపోతాయి. పరమాత్మతో సన్నిహితంగా కాకుండా, ఏకమైపోయారు అనుకోండి మొత్తానికి అవి రావటం మానేస్తాయి.

మీకు ఆస్తులు ఉండవచ్చు అవి మీరు కాదు, మీకు దేహం ఉంది అది మీరు కాదు, మీకు గౌరవాలు, అగౌరవాలు రావచ్చు అవి మీరు కాదు. ఇవి ఏమీ మీరు కాదు. మీరు కాని గొడవలతో తాదాత్మ్యం పొందితే మీరు పైకి బాగానే ఉన్నా లోపల కుళ్ళిపోతారు. అందువలన వీటితో కలపవద్దు. మనంతట మనం జ్ఞానం నేర్చుకోలేకపోతున్నాము. అందుచేత ఏ తలుపు సందులోనో పెట్టి మనలను నొక్కి లోపలఉన్న మాయనంతా కక్కించి మనకు జ్ఞానం నేర్పుతాడు, వాడు ఈశ్వరుడు. మనలను రోజూ మాయ ముట్టుకొంటోంది, దానివలననే మనకు అశాంతి. రోజూ మనలను ముట్టుకోవటం ఏదో రకంగా మనలను ఏడిపించటం అదే దానికి పని. మీరు భగవంతుడికి సన్నిహితంగా ఉంటే లోకం గొడవలు ఏమీ మిమ్మల్ని ముట్టుకోవు. లోపల రజోగుణం ఉన్నంతసేపు మనకు శాంతిరాదు. రజోగుణంలో నుండి కోరిక వస్తుంది. కోరికలో నుండి కోపం, ద్వేషం, కక్ష అన్నీ వస్తాయి. లోపల నిప్పు ఉన్నా పొగ దానిని కనబడనివ్వదు. అలాగే మన హృదయంలో జ్ఞానం ఉన్నా అది మనకు కనబడకుండా కామం దానిని కప్పేస్తోంది. కామక్రోధములు రజోగుణం నుండి వస్తున్నాయి, రజోగుణం తాలుక వికారాలు అవి. రజోగుణాన్ని తగ్గించుకోకుండా అవి తగ్గవు. రజోగుణం తాలుక వికారాలు తగ్గితే వాడు శాంత మనస్కుడు అవుతాడు. రజోగుణం తాలుక వికారాలనుండి నీవు విడుదల పొందితే సుఖసముద్రంలో, శాంతిసముద్రంలో ఈదులాడుతావు. ఈ శరీరాన్ని మనస్సు కల్పించింది. ఎందుకు కల్పించింది అంటే దానిని ఉపయోగించుకోవటానికి

కల్పించింది. కోరికలు అన్నీ మనస్సులో ఉన్నాయి. అవి నెరవేర్చుకోవటానికి శరీరం ఉండాలి కదా దానికి శరీరాన్ని ఉపయోగించుకొంటుంది. మనకు మనోనాశనం అవ్వలేదు కాబట్టి ఈ శరీరాలు వస్తున్నాయి. మనోనాశనం అయ్యింది అనుకోండి ఇంక శరీరంతో వాడికి పనిలేదు. ఇంకవాడికి పునర్జన్మ లేదు. ఇది మీరు అర్థం చేసుకోవాలి. ఇతరుల మీద ఆధారపడటం వలన వచ్చే సుఖం, శాంతి అవి ఎప్పటికైనా ప్రమాదమే. అవి స్వతంత్రమైనవి కాదు, అవి ఎప్పటికైనా ఊడిపోతాయి. మీరు చేసే స్నేహాల వలన పరిణామంలో దుఃఖం వస్తూ ఉంటే దేనికా స్నేహాలు అంటున్నారు. మీకు ఉన్న బంధుత్వాలు, స్నేహాలు, లోకంతోటి మీకు ఉన్న బంధాలు ఇవి అన్నీ పేకముక్కల కోటవంటివి, గట్టిగా గాలి వేస్తే అన్నీ కూలిపోతాయి. మీ దేహంతోటిగాని, ఇంద్రియాలతోటిగాని, ప్రకృతితోగాని, లోకంతోగాని సంబంధంలేని సుఖం మీ హృదయంలో ఉంది, అది స్వతంత్రమైనది, అదే ఉత్తమసుఖం, అది మీకు అనుభవంలోనికి వస్తే ఇంక దానికి ముగింపు లేదు, అలా ప్రవహిస్తూ ఉంటుంది, ఈలోపుగా మీ దేహానికి మరణం వచ్చింది అనుకోండి అయినా అది అలా కంటిన్యూ అయిపోతుంది. ఇప్పుడు మనం లోకంలో అనుభవించే సుఖాలలో దుఃఖం కలిసి ఉంటుంది, వీటివలన పరిణామంలో దుఃఖం వస్తుంది. ఉత్తమసుఖం అటువంటిదికాదు. ఉత్తమసుఖంలో ఇంక దుఃఖం కలవదు. ఉత్తమసుఖాన్ని పొందటానికి మనం సాధన చెయ్యాలి, దానికోసం ఈ దేహాన్ని ఉపయోగించుకోవాలి.

మనస్సులో కల్మషం లేకుండా జీవించండి. కల్మషం లేనివారిని లోకం అమాయకులు అనుకొంటుంది. లోకం అనుకొంటే అనుకోనివ్వండి. మనస్సును పరిశుద్ధంగా ఉంచుకోండి. మనస్సు పరిశుద్ధంగా లేకపోతే స్పష్టతరాదు. ఇప్పుడు నువ్వు నీ దేహంతో ఏకంగా ఉంటున్నావు, మనస్సుతో ఏకంగా ఉంటున్నావు. అలాగే నీ లోపలఉన్న బ్రహ్మపదార్థంతో ఏకంగా ఉండు. నీ మనస్సులో కల్మషం లేకుండా జీవిస్తూ ఉంటే అది నీకు సాధ్యమవుతుంది. కల్మషం రాకుండా ఉండాలంటే నువ్వు మాటలో జాగ్రత్తగా ఉండాలి, ఆలోచనలో జాగ్రత్తగా ఉండాలి, చేతలో జాగ్రత్తగా ఉండాలి, ఈ మూడూ ఏకంగా ఉండాలి. ఇవి రకరకాలుగా ఉంటే కల్మషం వచ్చేస్తుంది. కల్మషం ఉంది అనుకో నీవు రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలోనుండి విడుదలపొందలేవు. కొంతమంది పేరుకోసం ఏడుస్తూ ఉంటారు, ఆ పేరులో ఏముంది. రూపం ఎంత కల్పితమో నామం కూడా అంతే కల్పితం. కొంతమంది మీ చేత్తోటి ఇవ్వకండి మా చేత్తో ఇస్తాము అంటారు. అదొకరకమైన అహంకారం. ఏదో చెయ్యి ఇస్తోంది కదా. యోగి అంటే కల్మషం లేనివాడు, శాంతచిత్తం కలిగినవాడు, బ్రహ్మంలో ఏకమైనవాడు. వాడు సుఖాన్ని కోరుకోనక్కరలేదు, ఉత్తమసుఖం వచ్చి వాడిని వరిస్తుంది. మీరు మొఖాన్ని ఈశ్వరుడివైపుకి తిప్పి ఉంచితే చాలు మిగతా పని అంతా ఆయనే చూసుకొంటాడు. నువ్వు యోగ్యత సంపాదిస్తే చాలు మిగిలిన

పని ఆయనే పూర్తి చేస్తాడు, నిన్ను హృదయగుహలోనికి గెంటుకొనిపోయి ఆయన స్వరూపాన్ని నీకు ఇస్తాడు. అప్పుడు ఉత్తమసుఖాన్ని పొందుతావు, అదే కడసారిజన్మ.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-02-2010, చించినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు శివరాత్రి. అంటే శివుడు లింగరూపం ధరించినరోజు. శివుడు అంటే మంగళకరుడు. అంటే క్షేమాన్ని ప్రసాదిస్తాడు. మొదటిలింగం అరుణాచలం అని చెపుతారు. సమాజం అంటే జనసమూహము. వ్యక్తి బాగుపడకుండా సమాజం బాగుపడదు. మనం బాగుపడకుండా సమాజం బాగుపడాలి అంటే దానికి అర్థం లేదు. శివరాత్రి రోజున చాలామంది భోజనం చెయ్యరు కాని మనం భోజనాలు చేసి ఇక్కడ కూర్చొన్నాము. శివరాత్రి రోజన బోయవాడి కథ ఎక్కువగా చెపుతారు. కొంతమందికి ఏ రోజున పనికి వెళ్లకపోతే ఆరోజున అన్నం ఉండదు. శివరాత్రి రోజున ఆ బోయవాడికి పని దొరకలేదు అందుచేత ఆ రోజన అన్నం లేదు. అంటే పగలు భోజనం లేదు రాత్రి నడుము వాల్చుకోవటానికి ఒక చెట్టు మీద కూర్చుని కాలక్షేపానికి ఆ పత్రిని గిల్లి కింద వేస్తున్నాడు. ఆ చెట్టుకింద శివలింగం ఉంది, అది వాడికి తెలియదు. ఆ పత్రి అంతా శివలింగం మీద పడుతోంది. ఆ పత్రికి బాగా మంచు పట్టింది, అది కూడా శివలింగం మీద పడుతోంది. అంటే వాడికి తెలియకుండా పత్రితోటి పూజ చేస్తున్నాడు, పత్రిమీద ఉన్న నీరు శివుడికి అభిషేకం చేస్తున్నాయి. అంటే వాడికి పగలు ఉపవాసం, రాత్రి జాగరణ శివపూజ అయిపోయింది, వాడికి మోక్షం వచ్చేసింది. అంటే వాడు తెలియక చేసాడు. తెలియక చేస్తేనే అంత ఫలితం వచ్చింది ఇంక తెలుసుండి చేస్తే ఇంకెంత ఫలితం వస్తుంది అని ఈ బోయవాడి కథ చెపుతారు.

మీరు ఒకటి జ్ఞాపకం ఉంచుకోండి. రూపాన్నిబట్టి శక్తి ఉండదు. మనం భగవంతుడిని అనేక రూపాలతో, నామాలతో పూజిస్తూ ఉంటాము కాని ఉన్నది ఒక్కడే. కొంతమంది కృష్ణుడిని, కొంతమంది శివుడిని, కొంతమంది రాముడిని, కొంతమంది గురువును పూజిస్తారు. మన ప్రయత్నం లేకుండా మన మనస్సు ఎక్కడ నిలబడుతోందో అక్కడే మనం ఉపాసన చెయ్యాలి. చాలామంది వికారం మనుషులు ఉంటారు. వారు గంటకో రకంగా ఉంటారు. వారిలో వికారంగా ఉన్న మనస్సు నిర్వికారంగా అవ్వాలంటే రామనామం చెయ్యమని చెపుతారు. రామనామం సర్వరోగనివారిణి. పూర్వజన్మల నుండి వచ్చిన వాసనలు మన మనస్సును సరిగా ఉండనివ్వవు. రామనామం మనలను నిర్వికార స్థితికి తీసుకొనిపోతుంది. తులసీదాస్ గారికి భార్యే గురువు. తులసీదాస్‌గారి భార్య ఏమంది అంటే నీకు నా మీద ఉన్న ప్రేమ, నామీద ఉన్న మోహం నీకు రాముడి మీద ఉంటే ఈపాటికి నీకు మోక్షం వచ్చేసును అంటుంది.

ఆ మాట ఆయనలో ఎంతో మార్పు తీసుకువచ్చింది. ఆవిడ ఎవరు అనటానికి ఆ రాముడే అనిపించాడు. ఆయన తులసీ రామాయణం వ్రాసాడు. శివరాత్రి రోజున ముఖ్యం ఏమిటి అంటే శివుడికి అభిషేకం చెయ్యటం, పగలు ఉపవాసం, రాత్రి జాగరణ అంటే రాత్రి అంతా శివస్మరణతో గడపాలి. ఆచార్యుడు అంటే మీకు స్కూలులో పాఠాలు చెప్పే టీచరు వంటివాడు కాదు. ఆచార్యుడు ఏమి చేస్తాడు అంటే ఆయన బోధిస్తాడు, అది మీ మనస్సుకు పడుతోందో లేదో చూసుకొంటాడు, అది మీకు అనుభవంలోనికి వచ్చేవరకు, ఆత్మసుఖం మీకు అందే వరకూ ఆయన మిమ్మల్ని విడిచిపెట్టడు, ఆయన అనుగ్రహస్వరూపుడు, ఆయనే ఆచార్యుడు. పూర్వం ఇలా మీటింగులు లేవు. ఏదో కొద్దిమందిని దగ్గర కూర్చోబెట్టుకొని చెప్పేవారు. ఇలా సమూహం కింద చెప్పరు. అవి ప్రసంగాలు కాదు, అవి అనుగ్రహభాషణములు. బుద్ధుడు వంటి మహాత్ములు చెప్పేటప్పుడే జ్ఞానోదయం అయిపోయేది. వారు చెప్పింది మాట కాదు, అది అనుగ్రహం.

యాజ్ఞవల్క్యుడు జనకమహారాజుకు ఆత్మవిద్య గురించి బోధిస్తాడు. యాజ్ఞవల్క్యుడు బ్రహ్మఋషి. ఆయనకు సబ్జక్టు చేతిలో ఉంది, అది ఎలా చెప్పాలో తెలుసు. సబ్జక్టు వినేటప్పుడు జనకమహారాజు సంతోషంతో ఊగిపోతూ ఉండేవాడు. ఆయన సంతోషం పట్టలేక గురువుగారు మీకు వంద ఆవులు ఇచ్చానండి అనేవాడు. ఒకరోజు ఆయన ఉపదేశానికి ఉబ్బిపోయి బంగారు కాసులు ఇచ్చాను అనేవాడు. గురువుగారి ముఖంలో సంతోషం కనబడేది కాదు. ఆయన సబ్జక్టులో లీనమైపోయి ఉండేవాడు. ఇక్కడ జనకమహారాజుకు ఫౌండేషన్ ఉంది. అందువలన గురువు చెప్పేటప్పుడు ఆ సబ్జక్టు యొక్క అందాన్ని గ్రహించేవాడు. టీచింగ్ చేసేవాడు ఎంత గొప్పవాడైనా ఇక్కడ వినేవాడిలో ఫౌండేషన్ లేనప్పుడు, అర్హత లేనప్పుడు సబ్జక్టు విలువను గ్రహించలేడు. పదిరోజులలో జనకమహారాజుకు సబ్జక్టు చెప్పి చివరలో ఒకమాట చెపుతాడు. ముందు నేను చెప్పిన సబ్జక్టును మీరు అర్థంచేసుకోండి, దాని తాలుక సుఖం మీకు తెలియాలి. అప్పుడు మీరు ఏదైనా ఇస్తే పుచ్చుకొంటాను కాని కండిషన్ ఏమిటి అంటే నేను గురువుగారికి ఆవులు ఇచ్చాను, డబ్బులు ఇచ్చాను అని మీకు జ్ఞాపకం రాకూడదు, అలా మీరు మనస్సులో అనుకొన్నా నేను పుచ్చుకోను. మీరు డబ్బులు ఇవ్వకపోయినా ఫరవాలేదు, నాపట్ల కృతజ్ఞత ఉంటేచాలు. అక్కడ మీరు ఇచ్చే ఆవులు ముఖ్యం కాదు. ఆవులు ఇచ్చేటప్పుడు ఏ దృక్పథంతో ఇస్తున్నారో అది ముఖ్యం. ఆ దృక్పథం సరిగా లేకపోతే మీరు ఇచ్చే ఆవులు మమ్మల్ని సుఖపెట్టవు సరికదా అనారోగ్యాన్ని తీసుకొనివస్తాయి. మీకు ఇలా ఉండాలి అని చెపుతున్నాను మరి నేను ఎలా ఉండాలి ఉంటే నేను కష్టపడి చదువు చెప్పాను అనే విషయం నేను మరిచిపోవాలి. మీరు ఇచ్చిన డబ్బు జ్ఞాపకం ఉండకూడదు కాని మీరు ఇచ్చిన దానికి కృతజ్ఞత కలిగిఉండాలి.

ఒకరిపట్ల ఒకరు కృతజ్ఞత కలిగిఉండాలి, పరస్పరం ప్రేమలు ఉండాలి, మిగిలిన విషయాలు జ్ఞాపకం ఉండకూడదు. అది గురుశిష్యుల సంబంధం.

నువ్వు మూగవాడిగా ఉండకు, చెవిటివాడిగా ఉండకు అని శాస్త్రంలో చెప్పాడు. ఎవరైనా పెద్దలు మంచిమాటలు చెపుతూ ఉంటే చెవిటివాడిగా ఉండకండి. ఆ మాటలను శ్రవణం చెయ్యండి. వినటం వలన నష్టంలేదు. మంచిమాటలను శ్రవణం చేయటం వలన ఎప్పుడైనా మనకు అవసరమైనప్పుడు సడన్‌గా జ్ఞాపకం వస్తాయి. అంటే చెవుల ద్వారా వినటం కాదు, చెవులద్వారా ఎవడు వింటున్నాడో ఆ మనస్సును శరీరంతోపాటు అక్కడే ఉంచి అంటే మనస్సును అక్కడ పెట్టి వినాలి. మూగవాడిగా ఉండకు అంటే నీకు తెలిసిన విద్యను, నువ్వు విన్న మంచిమాటలను అవసరమైతే ఇతరులకు చెప్పాలి. వారు విన్నా వినకపోయినా నీకు మంచి అని తోస్తే అది ఇతరులకు చెప్ప. మీరు అందరూ మోక్షం అంటే సరదా పడుతున్నారు. మాకు మోక్షం కావాలి అంటున్నారు. అక్కడ శరీరం ఉండదు ముందు ఆలోచించుకోండి. మీకు శరీరాలు అంటే ఇష్టం కదా మరి మోక్షం వస్తే ఇంక ఈ శరీరం గొడవ ఉండదు. మోక్షం అంటే అక్కడ మనం ఉన్నామన్న సంగతి మనకు తెలుస్తూ ఉంటుంది. అక్కడ దేహం గొడవ, మనస్సు గొడవ ఉండదు. అక్కడ జ్ఞానంగా ఉంటాము, శాంతిగా ఉంటాము, సుఖంగా ఉంటాము. రామకృష్ణ పరమహంసగారి దేహము, మనస్సు పరిశుద్ధముగా ఉండేది. మన మనస్సు, దేహము అంత పరిశుద్ధమైతే గాని మనకు ఆత్మజ్ఞానం రాదు. అందరిహృదయాలలో నేను ఉన్నాను అని పరమాత్మ చెప్పాడు కదా అది గుర్తించే అర్హత లేక ఎక్కడో బయట తిరుగుతున్నాము. అర్హత లేనివారికి, యోగ్యత లేనివారికి విద్య చెప్పినా అది రాణించదు. పూర్వపు రోజులలో ఆచార్యులు ఏమి చేసేవారు అంటే అర్హత ఉన్న శిష్యులను చేరదీసి వారికి తినటానికి తిండి లేకపోయినా వారే దగ్గర ఉంచుకొని అన్నం పెట్టి విద్య చెప్పేవారు. మన దేహము, మనస్సు పరిశుద్ధమవ్వాలి. అప్పుడే లోపలఉన్న సత్యాన్ని తెలుసుకొనే అర్హత కలుగుతుంది.

భగవాన్ దగ్గరకు వెళ్ళి అక్కడకు వెళ్ళాము, ఇక్కడకు వెళ్ళాము, వారు అలా మాట్లాడారు, వీరు ఇలా మాట్లాడారు అంటే భగవాన్ ఏమన్నారు అంటే అది వారి తప్పకాదు, నీదే తప్ప అనేవారు. ఎక్కడకు వెళ్ళాలి, ఎక్కడకు వెళ్ళకూడదు అని ముందు మీకు ఆలోచన ఉండాలి, వివేకం ఉండాలి. అందుచేత మీకు వివేకం తక్కువ ఉన్నా గురువు చెప్పిన మాట మీద విశ్వాసం ఉంటే తెలివైన వారికంటే మీరు ఎక్కువ లాభం పొందుతారు. మీరు ఆలోచించి ఆలోచించి కొంతదూరమే వెళ్ళగలరు. మీకు ఆచార్యుడిపట్ల విశ్వాసం ఉంటే అదే మిమ్మల్ని గమ్యానికి చేరుస్తుంది. మీ గురించి మీరు ఎక్కడా గొప్పలు చెప్పకోవద్దు. కొంతమందికి ఉదయం లేచినది మొదలు రాత్రి నిద్రపోయేవరకు ఎవరో ఇతరులను నిందించటం, వారిని

వారు పొగుడుకోవటం తప్పించి ఇంకో పని ఉండదు. నేను అది సాధించాను, ఇది సాధించాను అని చెప్పకోవటం వలన దేహాభిమానం పెరిగిపోతుంది, అజ్ఞానం పెరిగిపోతుంది, స్వరూపానికి దూరమైపోతాము. ఇతరులు మిమ్మల్ని గౌరవిస్తే అదివేరు, ఇతరులు అందరూ మిమ్మల్ని గౌరవించాలి అనుకోకూడదు. మేము బాగా చదువుకొన్నాము అనే గర్వం, మేము ధనవంతులం అనే గర్వం, ఈ సమాజంలో మాకు చాలా గౌరవం ఉంది అనే గర్వం ఇవన్నీ చాలా ప్రమాదం. మీరు సాధన చేసినా అవి అంత తొందరగా పోతాయి అని చెప్పలేము. వాటిని తొలగించుకోవటం చాలా కష్టం. మీకు బంగారం ఉంటే దాచుకోండి. ఎక్కువగా మెడలో వేసుకొని తిరగవద్దు. మీకు డబ్బు ఉందని ఖరీదైన బట్టలు వేసుకొని తిరగవద్దు. దానివలన అహంకారం పెరుగుతుంది. మీకు ఏదైనా ఉన్నా పైకి ప్రదర్శించకండి. కొంతమంది పైకి మర్యాదగా మాట్లాడతారు లోపల గర్వం పెంచుకొంటారు. అది మరీ ప్రమాదం. కొంతమందికి అప్పలు ఉంటాయి. అప్పలు ఎవరికీ తెలియనివ్వకపోయినా వడ్డీ పెరిగిపోతూ ఉంటుంది కదా. అలాగే మనకు గర్వం ఉన్నట్లు ఎవరికీ తెలియకుండా ప్రవర్తించినా లోపల కుళ్ళిపోతూ ఉంటాము. ఇవన్నీ జాగ్రత్తగా పరిశీలించుకోండి.

మీరు వాక్కుద్వారాగాని, చేతద్వారాగాని ఎవరినీ హింస పెట్టకూడదు. మీరు చెప్పే మాట సౌమ్యంగా ఉండాలి. చెప్పేది సాత్వికంగా ఉండాలి. సత్వగుణంలో ఉండి చెపితే ఆ మాట చాలా మధురంగా ఉంటుంది. సాత్వికంగా మాట్లాడితే వారినోట్లో లడ్డూ పెట్టినట్లు ఉంటుంది. రజోగుణంలో చెపితే వారి నోట్లో కారం పోసినట్లుగా ఉంటుంది. స్వధర్మం, పరధర్మం గురించి ఐన్‌స్టీన్ ఏమి చెప్పాడు అంటే ప్రతీ మనిషికి ఒక స్వభావం ఉంటుంది. ఆ స్వభావానికి అనుగుణమైన పనే చేసుకో. ఎవరో చేస్తున్నారని నువ్వు చెయ్యవద్దు, వారిని అనుకరించవద్దు. నీ స్వభావానికి అనుగుణమైన పనిచేస్తే ఆ పని నిన్ను సుఖపెడుతుంది, నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, ఆ పని నీకు జ్ఞానాన్ని పట్టి ఇస్తుంది. పనిచేస్తూ పనిని దాటివెళ్ళిపో అంతేగాని సోమరితనంగా కూర్చొంటే పనిని దాటలేవు. ఇది మీ జీవితం పొడవునా జ్ఞాపకం పెట్టుకోండి. మనం మంచివారము అని ఇతరులు చెప్పకొంటే మనం మంచివారము కాదు. మన బుద్ధికి మనం ఋజువుగా ఉండాలి. మనం చేసిన పనులకు ఏదోరోజున భగవంతుడి ముందు నిలబడి సమాధానం చెప్పాలి, అది గుర్తు పెట్టుకోండి. నువ్వు ఇతరులను బాధపెట్టవద్దు. ఇతరులు నిన్ను హింసించినా నువ్వు హింసకు గురికావద్దు. ఇతరులు నిన్ను బాధ పెట్టినప్పడు నువ్వు సహనంగా ఉండటం, వారి వలలో పడకుండా ఉండటం కూడా ఒక సాధన. ఋజుత్వం అనేది, సరళత్వం అనేది నువ్వు తెచ్చిపెట్టుకొన్నట్లు ఉండకూడదు, అవి సహజంగానే ఉండాలి. నీ శారీరకఆరోగ్యం, మానసికఆరోగ్యం జాగ్రత్తగా కాపాడుకొంటూ ఉంటే నీ శరీరం, మనస్సు

హృదయంలో ఉన్న సత్యాన్ని తెలుసుకోవటానికి నీకు సహకరిస్తాయి. నీ ఆరోగ్యం సరిగా లేనప్పుడు నువ్వు సత్యాన్వేషణ చెయ్యలేవు. నీ హృదయంలో ఉన్న సత్యాన్ని గోచరం చేసుకోకుండా ఏది సాధించినా అది అంతా స్వప్నమే. మీకు జ్ఞానోదయం అయ్యాక ఇది అంతా అబద్ధం అని మీకే తెలుస్తుంది. ఆత్మవిద్య సంపాదించటానికి నిరంతరం కృషిచెయ్యి. అన్ని విషయాలకంటే మనోనిగ్రహం గొప్పది. మనోనిగ్రహం కోసం ప్రయత్నం చెయ్యి. నీకు ఏకాంతవాసం కొంత అవసరం. ఎప్పడూ జనాలతో కలిసిపోయి బజారులో పడిపోకండి. ఇంటి దగ్గర కొంతటైము ప్రశాంతంగా ఒంటరిగా కూర్చోండి. ఏకాంతంగా ఉన్నప్పడు మనలో ఉన్న మంచి చెడ్డలు మనకు తెలుస్తాయి, మీరు పోగొట్టుకోవలసింది ఏమిటో మీకు తెలుస్తుంది. అది పోగొట్టుకోవటానికి నిరంతరం కృషిచెయ్యండి, ఆ ప్రయత్నంలో విసుగుదల పనికిరాదు.

భగవద్గీతలోని శ్లోకాలను, పెద్దలు చెప్పిన మాటలను అప్పడప్పడూ తలపెట్టుకోండి. వాటిని తలపెట్టుకోవటం వలన మీ బుద్ధికి బలం పెరుగుతుంది, జ్ఞాపకశక్తి పెరుగుతుంది, సత్యాన్ని తెలుసుకొనే యోగ్యత కలుగుతుంది. బంగారాన్ని శుద్ధి చేయటానికి నిప్పలో పడేస్తారు, అప్పడు బంగారంలో ఉన్న మాలిన్యం అంతా పోయి బంగారం శుద్ధి అవుతుంది. అలాగే మీ మనస్సులో ఉన్న దుర్గుణాలు, దోషాలు పోవటానికి మనస్సును తీసుకొనివెళ్ళి భక్తి అనే నిప్పలో పడేయండి. భక్తి నీ మనస్సులో ఉన్న దోషాలను తొలగిస్తుంది, అప్పడు మనస్సు శుచి అవుతుంది. విషయసుఖాలపట్ల వైరాగ్యం కలిగి ఉండండి. విషయసుఖాలు మొదట తియ్యగా ఉంటాయి కాని పరిణామంలో అవి చేదుగా మారిపోతాయి, దుఃఖాన్ని తీసుకుని వస్తాయి. జాయ్ వేరు, ఎంజాయ్ వేరు. వివేకం వలన, విచారణ వలన, ఆత్మచింతన వలన మీ హృదయంలో నుండి వచ్చే సంతోషాన్ని జాయ్ అంటారు. దానికి ముగింపు లేదు, అది ఆరోజుకారోజు పెరిగిపోతూ ఉంటుంది, అది స్వతంత్రమైనది. ఇక బాహ్య వ్యక్తులమీద, వస్తువులమీద, సంపదల మీద ఆధారపడి వచ్చే సంతోషం ఎంజాయ్‌మెంట్. ఇది మొదట బాగానే ఉంటుంది. తరువాత విసుగు వచ్చేస్తుంది. ఈ సంతోషం పరిణామంలో దుఃఖాన్ని తీసుకొనివస్తుంది. ఒక దెయ్యం ఋషికి కనబడింది. నువ్వు ఏపని చెపితే ఆ పని చేస్తాను కాని పని చెప్పకపోతే నిన్ను తినేస్తాను అంది. వీడు ఏపని చెపితే ఆ పని చెసేస్తోంది. ఎన్ని పనులు చెపుతాడు. ఆయన ఋషికదా వివేకం ఉపయోగించి ఒక కర్ర పాతేసి దీనిపైకి కిందకు తిరుగుతూ ఉండు అన్నాడు. ఆ తిరగటానికి ముగింపు లేదు కదా. మన మనస్సు కూడా దెయ్యం లాంటిది. దానికి పని చెప్పకపోతే అది మనలను తినేస్తుంది. రోజూ కల్పించుకొని పనులు ఎక్కడ చెప్పగలము. అందుకే ప్రాణాయామం చెప్పారు. మీరు మర్చిపోయినా ముక్కులోగాలి అలా తిరుగుతూ

ఉంటుంది కదా. మీ మనస్సును తీసుకొని వెళ్ళి ముక్కులో గాలి దగ్గర పాడేయమన్నారు. ఆచార్యులవారు ఏమన్నారు అంటే నీ మనస్సును డైరెక్టుగా ఫేస్ చెయ్యలేక, దానిని పరిష్కరించు కోలేక ఇలాగ డొంకతిరుగుడు పద్ధతులలోనికి వెళ్ళావా అంటున్నారు. విషయసుఖాలను జాగ్రత్తగా తగ్గించుకొంటూ రావాలి. ఒకేసారి తగ్గిస్తే అవి ఎదురుతిరుగుతాయి. సడన్ బ్రేక్ వేస్తే ఉన్నది చెడిపోతుంది. నెమ్మదిగా అర్థమయ్యేలాగ చెప్పి, విషయస్మరణ వలన పరిణామంలో ఎంత అశాంతి వస్తుందో మనస్సుకు బోధించి మన మనస్సును మనమే ఉద్ధరించుకోవాలి. మనం రోజుకోసారి చనిపోతూ ఉంటాము అంటే మనం రోజూ నిద్రపోతాం కదా. నిద్రపోయిన వాడు చనిపోయిన వాడితో సమానం. అసలు చావు వేరుపాటుగా వస్తుంది, అది మహా చావు, అప్పుడు పెర్మనెంట్‌గా ఈ శరీరాన్ని విడిచిపెట్టస్తాము, ఈ లోపు రోజూ నిద్రలోనికి వెళ్ళేటప్పుడు ట్రైల్ వేసుకోమంటున్నాడు ఆచార్యులవారు. రోజూ నిద్రపోయే ముందు భగవంతుడి రూపాన్ని ధ్యానించుకో, ఆయన నామాన్ని స్మరించుకో, ఆ ధ్యాసలో మీకు నిద్ర రావాలి. అలా ప్రయత్నం చేస్తూ ఉంటే మహాచావు వచ్చినప్పుడు కూడా ఆ ధ్యాసలో ప్రిఫర్ అవుతాము దానికోసం ఇక్కడ ముందు రెడీ అవ్వాలి. భోజనం చేసేటప్పుడు మొదటి ముద్ద పెట్టుకొనేటప్పుడు గోవింద గోవింద అనుకొంటారు. కాని నాకు గోవింద శబ్దం రావటంలేదు. కాటన్ కాటన్ అనుకొంటాను ఎందుచేతనంటే మన జిల్లాలకు అన్నం పెట్టినవాడు కాటన్. కాటన్ దొర ఇక్కడ పడిన కష్టాలు, ఆయన పడ్డ తిట్లు అన్నీ నాకు తెలుసు. ఇన్ని తిట్లుతిని, ఏమీ సంపాదించుకోకుండానే వట్టి చేతులతో ఇంగ్లాండ్ వెళ్ళిపోయాడు. ఆయన కాటన్ దొర.

మీ దుఃఖానికి కారణం బయటలేదు. నీలోపలే ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. కర్తృత్వం ఉన్నంతసేపు వాడు ఎంతటివాడైనా దుఃఖం ఆగదు, పునర్జన్మలు ఆగవు. కర్తృత్వం లేనివాడికి దుఃఖం లేదు. మనం అస్తమాను నేను, నేను అంటాము. సర్వసాధారణంగా మనం మాట్లాడేటప్పుడు ముందు నేను వచ్చేస్తుంది. ఆ నేనును తగ్గించుకోవాలి, ఆ నేనును ప్రక్కన పెట్టి మాట్లాడితే ఆ మాట సౌమ్యంగా ఉంటుంది, అది ఎదుటివారి గుండెకు పడుతుంది. జగత్తు, జీవుడు, ఈశ్వరుడు మనోకల్పితములు అని భగవాన్ చెప్పారు. దీనిని సరిగా అర్థం చేసుకోలేక చాలామంది పెద్దవారు దీనిని ఆక్షేపిస్తున్నారు. అసలు ఈయన భక్తుడా, నాస్తికుడా అంటున్నారు. దేవుడు కూడా మనోకల్పితం అంటే దాని గురించి కొంతమంది భక్తులకు కోపాలు వస్తున్నాయి. నీకు నిద్రలో దేహంగొడవ, మనస్సు గొడవ, లోకం గొడవ, దేవుడు గొడవ ఉందా? ఏ గొడవ లేదు. మనకు ఎంత డబ్బు ఉన్నా, చదువు ఉన్నా కామన్‌సెన్స్ లేనివారు రాణించలేరు. నీకు దేవుడి గొడవ ఎప్పుడు వస్తోంది మెలకువ వచ్చాక వస్తోంది. నిద్రలో దేవుడి గొడవలేదు. మెలకువ రాగానే మనస్సు వస్తోంది. మనస్సుతో పాటు లోకం

గొడవ, దేవుడి గొడవ, పుణ్యపాపాలు, జన్మల గొడవ అన్నీ వస్తున్నాయి. గాఢనిద్రలో మనస్సు అణిగిపోయినప్పడు అన్నీ అణిగిపోతున్నాయి. మెలకువ రాగానే మనస్సు వచ్చాక ఈ గొడవలు అన్నీ వస్తున్నాయి. మనస్సు వచ్చాక ఏ గొడవలు అయితే వస్తున్నాయో, మనస్సు ఎంత నిజమో ఆ గొడవలు కూడా అంతే నిజం. అంటే నీ మనస్సు ఎంత నిజమో దేవుడు కూడా అంతే నిజం. నీకు పూర్వపుణ్యం లేకపోతే అసలు అద్వైతవాసన కూడా రాదు. మనస్సు వచ్చినప్పడు ఏవైతే వస్తున్నాయో అవి అన్నీ మనోకల్పితములే. శరీరం వచ్చింది అంటే మరణం వస్తుంది, రోగం వస్తుంది, ముసలితనం వస్తుంది. ఏదోరోజన చనిపోతాము. ఈలోపుగా దేహప్రారబ్ధాన్ని బట్టి ఏదో ఒకటి వస్తూ ఉంటాయి. ఇప్పడు మీకు కష్టాలు లేవు అనుకోవద్దు ఏదో టైములో రావచ్చు.

దేవుడియందు ప్రేమకలిగి ఉండటమే భక్తి. వ్యభిచారభక్తి పనికిరాదు. వ్యభిచారభక్తి అంటే భక్తి స్థిరంగా ఉండదు, శాశ్వతంగా ఉండదు, ఎంతోకొంత భక్తి ఉంటుంది కాని శ్రద్ధ ఉండదు. నీకు ఉండవలసింది వ్యభిచారభక్తి కాదు, అవ్యభిచారభక్తి ఉండాలి. అంటే చపలత్వం ఉండకూడదు, విశ్వాసం స్థిరంగా ఉండాలి. మీరు నిద్రపోయేముందు మిమ్మల్ని ప్రేమించేవారిని, మీ క్షేమం కోరేవారిని స్మరించుకొని పడుకోండి. మీకు గాఢమైన నిద్ర వచ్చేస్తుంది. మిమ్మల్ని చూసి అసూయపడేవారిని, మిమ్మల్ని ద్వేషించేవారిని దృష్టిలో పెట్టుకోవద్దు. అరవిందఘోష్‌గారిని ఉరితీద్దాము అనుకొన్నారు. చిత్తరంజన్‌దాస్ బెంగాల్ కోర్టులో 16 రోజులు వాదించారు. మీరు ఆయన శరీరాన్ని ఉరితీయవచ్చు. ఆయన శరీరం పంచభూతాల్లో కలిసిపోతుంది. కాని ఆయన మానవజాతిని ఎంత గాఢంగా ప్రేమించాడో అది ప్రపంచం మరిచిపోదు. మనిషిని ఉరితీయగలరు కాని ఆయనకు మానవజాతిమీద, భగవంతుడిమీద ఉన్న ప్రేమను ఎక్కడ ఉరితీయగలరు అన్నాడు. భాగవతంలో ఒక మహాభక్తుడు ఏమన్నాడు అంటే ఓ నారాయణా! నాకు మోక్షం ఇవ్వకు, నాకు జన్మలు రాకుండా చేయమని నేను కోరుకోను. నువ్వు అందరి హృదయాలలో ఉంటున్నావుకదా అలాగే నన్ను కూడా అందరి హృదయాలలో ఉండేలాగ చెయ్యి. కాని నువ్వు చేసేపని నేను చెయ్యను. నువ్వు అందరి హృదయాలలో ఉండి వారి ప్రారబ్ధాన్ని బట్టి ఆ జీవులను నడిపిస్తున్నావు, వారు చేసిన కర్మలకు ఫలితాన్ని ఇస్తున్నావు. నేను అందరి హృదయాలలో ఉండి ఏమి చేస్తాను అంటే ప్రతీ జీవుడికి ఎంతోకొంత దుఃఖం ఉంటుంది కదా. ఆ దుఃఖం వారికి రాకుండా ఆ దుఃఖాన్ని నేను భరించే శక్తిని నాకు ఇయ్యి. వారి పుణ్యం నాకు వద్దు, వారి శాంతిని వారికే ఇచ్చెయ్యి. ఎవరికైతే దుఃఖం వచ్చిందో ఆ దుఃఖంవారు పడకూడదు, ఆ దుఃఖం నేను అనుభవిస్తాను అన్నాడు. నేను భాగవతంలో ఇది చదివేవరకూ అంత గొప్ప భక్తులు ఉంటారని నేను ఊహించలేదు. అటువంటి ఉత్తమోత్తములు ఉంటారని మనం ఊహించలేము.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| మార్చి | 7 | జిన్నూరు, శ్రీరమణ క్షేత్రం |
| మార్చి | 31 | జిన్నూరు, శ్రీరమణ క్షేత్రం |
| ఏప్రియల్ | 21 | అమలాపురం, క్షత్రియ కళ్యాణ మండపం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**



**చించినాడ ప్రెసిడెంటుగారిచేత నిర్మింపబడిన**

**అతిథి భవనము ప్రారంభోత్సవములో**

**సద్గురు శ్రీ నాన్నగారు,**

**పాలకొల్లు శాసన సభ్యురాలు శ్రీమతి బంగారు ఉషారాణిగారు**

# బాధను పోగొట్టటానికే బోధ

అవిద్య అనే స్వప్నములో మనం ఉన్నంతకాలం కన్నీటికి, చిరునవ్వుకూ మధ్య మనం జీవించక తప్పదు, అంతవరకూ మనం సత్యాన్ని తెలుసుకోలేము. అక్కడ నిరంతరం బాధ కాపురముంటుంది. దీని పరిష్కారాన్ని శంకరులు సత్‌సంఘంవల్ల నిస్సంగత్వం, దానివల్ల నిర్మోహత్వం, దానివల్ల నిశ్చలత్వం వస్తుంది. నిశ్చలత్వమే జీవన్ముక్తి అన్నారు. "నీచ గుణములెల్ల నిర్మూలమైపోవు సుజన గోష్టివల్ల" అన్నది సత్యం. భయం సాంప్రదాయం యొక్క బరువు. మన జీవితంలో ఏదైనా అపహాస్యమైన విషయం జరిగితే ఒంటరిపాటుతో కుమిలిపోకూడదు. అవి అన్ని స్వప్నాలే, బోధ యొక్క ప్రయోజనం అదే. ప్రేమకు మూల శత్రువు అహంకారం. రాగము, ఆశక్తి, మోహము, ఈర్ష్య, క్రోధము దాని సంతానం. అహంకారం పరివారం చాలా పెద్దది. ఆ శత్రువులను శ్రవణ మహిమ వల్ల జయించటం వల్ల వాటిపై విరక్తి ఉత్పన్నమై, విషయాశక్తి వగైరాలు తెగిపోతాయి. చిత్తశుద్ధి కలుగుతుంది. సత్యం నేనే అనే బుద్ధి ధృడమౌతుంది. అభిమానం, మమత్వం తొలగిపోతాయి. సందేహాలు, శంకలు ఎగిరిపోతాయి. నేను అనే భావం తొలగిపోతుంది. సద్గురువు ప్రవచనం అత్యంత శ్రద్ధగా వినాలి. ఆ మాటలు హృదయం నుంచి వస్తాయి కాబట్టి మన హృదయాన్ని తాకుతాయి. అప్పుడు మన అజ్ఞానం అంతరిస్తుంది. శ్రీనాన్నగారు "అంతా ఈశ్వర నిర్ణయం ప్రకారం జరుగుతోంది అని బోధపడితే ఈ గంతు ఇక్కడ ఇలా వేద్దాము, ఆ గంతు అక్కడ అలా వేద్దాము అనే ఆలోచన రాదు. దానికి బోధ కావాలి. ఏదైనా వింటేకదా విషయం తెలిసి ఆచరిస్తారు" అన్నారు. రూపం యొక్క అనిత్యత్వాన్ని దాని పరిణామ స్వభావము తెలుసుకొన్నవాడు బెంగలుపోతాయి సుఖి అవుతాడు - వివేకం, సద్‌బుద్ధి శ్రవణం వల్లనే సాధ్యం కాబట్టి దానికి సమానమైనది మరియొకటి లేదు. దురాత్ముడు పుణ్యాత్ముడు అవుతాడు. సత్యానుభవానికి మనం వెయ్యినొక్క అవరోధాలు సృష్టించుకొంటున్నాము. దానిలో భయం ఒకటి అది మనలను స్వంతం చేసుకొంటుంది. మనం మనలోనే ముడుచుకొనిపోతాము. ఊరకఉంటే ఉన్నది ఉన్నట్లు వ్యక్తమవుతుంది. విషయాలను తేలికగా తీసుకోవాలి లోపల నిండుగా మెలుకువగా జీవించాలి. అందానికి స్పందించటం అసహ్యానికి చీదరించుకోవటం వల్ల ఘర్షణ కలుగుతుంది. ఎప్పడూ స్వచ్ఛంగా ఉండాలి. పరిస్థితులకు బానిస కాకుండా జాగరూకతతో ఉండాలి. ఇది గురుబోధ యొక్క వైభవం వల్లనే సాధ్యమౌతుంది.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**